రాధాకిషన్‌రావు బెయిల్ పిటిషన్‌పై

## పోలీసులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం మాజీ పోలీస్ అధికారి రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై 2 వారాల్లోగా కౌంటర్ వేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దీనితోపాటు హరీశ్‌రావు పిటిషన్‌నూ 24న విచారణ జరుపుతామని జడ్జి ప్రకటించారు.

## ‘సెట్’లో ఉస్మానియా అన్‌ఫిట్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : ఒక పరీక్షలో ఒకటో రెండో ప్రశ్నలు తప్పుగా రావడం, వాటికి మార్కులు కలపడం సహజం. కానీ, వందేండ్ల చరిత్ర గల ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్(సెట్) చరిత్ర పేపర్‌లో ఏకంగా 39 ప్రశ్నలు తప్పుగా ఇవ్వడం గమనార్హం. దీంతో పరీక్ష రాసిన అభ్యర్థులకు 50 మార్కులు కలపాల్సి వచ్చింది. 2024 సెప్టెంబర్‌లో ఉస్మానియా యూనివర్సిటీ సెట్ పరీక్షలను నిర్వహించింది. సెప్టెంబర్ 10న చరిత్రకు సంబంధించి రెండు పేపర్లకు పరీక్షలు నిర్వహించి ప్రాథమిక కీ విడుదల చేశారు. అభ్యంతరాలు స్వీకరించగా మొత్తం 39 ప్రశ్నలు తప్పుగా ఉన్నట్టు తేలింది.

# ఏపీ కులం సర్టిఫికెట్ తెలంగాణలో చెల్లదు

- **పీజీ మెడికల్ అడ్మిషన్లలో హైకోర్టు తీర్పు**
- **ఏపీ సర్టిఫికెట్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. తెలంగాణ ఏర్పాటు లక్ష్యం నీరుగారుతుంది**
- **అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదన**

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం తెలంగాణలో పీజీ మెడికల్ అడ్మిషన్లకు చెల్లబాటు కాదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. తెలంగాణ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిందేనని, ఈ అభ్యర్థులకే రిజర్వేషన్లు వర్తిస్తాయని స్పష్టంచేసింది. ఏపీ ప్రభుత్వం జారీ చేసిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల ద్వారా రిజర్వేషన్ క్యాటగిరీ కింద తన దరఖాస్తును అనుమతించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. రాష్ట్రానికి చెందిన నిర్దేశిత అధికారి జారీ చేసే ఎస్సీ/ఎస్టీ/బీసీ కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించిన అభ్యర్థులకే పీజీ మెడికల్ అడ్మిషన్లలో రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయ చర్యను సమర్థించింది. ఆ నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుక యారాతో కూడిన ధర్మాసనం సోమవారం సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఈ సందర్భంగా కాళోజీ వర్సిటీ, ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఏపీకి చెందిన ఎస్సీ వర్గాలు తెలంగాణలో రిజర్వేషన్లు కోరడం సరికాదని అన్నారు. ఏపీ కుల ధ్రువీకరణ పత్రాన్ని తెలంగాణలో అమలు చేయాలని కోరడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 5లో తెలంగాణలో ఏ కులాలు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలుగా ఉన్నాయో స్పష్టంగా ఉందని చెప్పారు. ఆ మేరకు రిజర్వేషన్ల అమలు ఉంటుందని అన్నారు. ఏపీ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని అనుమతిస్తే తెలంగాణ ఏర్పాటు లక్ష్యం నీరుగారుతుందని చెప్పారు. ఒక రాష్ట్రంలోని ఎస్సీలను మరో రాష్ట్రంలో ఎస్సీలుగా పరిగణించాలని లేదని అ న్నారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్రంలో తీసుకున్న కులధ్రువీకరణ పత్రమే చెల్లుబాటు అవుతుందని చెప్పారు. ఇతర రాష్ట్రంలో ఎస్సీ/ ఎస్టీగా ఉన్నవారి పిల్లలు వలస రాష్ట్రంలో పుడితే వారి కులం అక్కడ షెడ్యూలులో లేకపోతే రిజర్వేషన్ క్లెయిం చేయడానికి వీల్లేదని, తెలంగాణలో కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేసే అధికారాన్ని ప్రభుత్వం ఎమ్మార్వో, ఆర్డీవోలకు ఇచ్చిందని చెప్పారు. ఇరుపక్షాల వాదనల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం/వర్సిటీల వాదనలను హైకోర్టు ఆమోదిస్తూ తీర్పు వెలువరించింది.

# రిటైర్మెంట్ వయసు పెంపుపై రగడ

- **12 వర్సిటీలకే వర్తింపజేసిన ప్రభుత్వం**
- **తమకూ అవకాశమివ్వాలంటున్న వెటర్నరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ ప్రొఫెసర్లు**
- **సర్కారు తీరును వ్యతిరేకిస్తున్న ఆచార్యులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు రగడకు దారి తీస్తున్నది. వయోపరిమితి పెంపును అన్ని యూనివర్సిటీలకు కాకుండా కేవలం 12 వర్సిటీలకే వర్తింపజేయడం వివాదాస్పదమవుతున్నది. ఇటీవల ప్రభుత్వం ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయోపరిమితిని 60 నుంచి 65 ఏండ్లకు పెంచిన విషయం తెలిసిందే. అయితే, ఇది కేవలం 12 వర్సిటీలకే వర్తింపజేసి అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, ఫారెస్ట్ వర్సిటీలను మినహాయించారు. దీంతో తాము ఏం అన్యాయం చేశామని, తమకూ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. వివక్షపూరితంగా వ్యవహరిస్తున్న సర్కారు తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు.

**2021 నుంచి వర్తింపజేయాలి..**

యూజీసీ నిబంధనల ప్రకారం రిటైర్మెంట్ వయసు పెంపు 65 ఏండ్ల వరకు పెంచుకోవచ్చు. ఈ విషయంలో సర్కారు నిర్ణయమే ఫైనల్. ఇప్పటికే పలు రాష్ట్రాలు 65 ఏండ్లకు పెంచాయి. మన రాష్ట్రానికి చెందిన కొంతమంది ఆచార్యులు 2021లో దీనిపై హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే అప్పుడు 65 ఏండ్లకు పెంచడం వీలు కాదని ప్రభుత్వం స్పష్టంచేసింది.

# జేఈఈ మెయిన్స్‌లో 12 ప్రశ్నల తొలగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): జేఈఈ ప్రశ్నపత్రాల్లో తప్పులు పునరావృతమవుతున్నాయి. దాంతో ఈ సారి మెయిన్స్‌లో ఏకంగా 12 ప్రశ్నలను ఎన్టీఏ ఉపసంహరించింది. ఫిజిక్స్‌లో 8, కెమిస్ట్రీ 2, గణితంలో 2 చొప్పున ఉపసంహరించారు. ఈ పరీక్షల ఫలితాలను ఈ నెల 12న విడుదల చేసే అవకాశాలున్నాయి.

**13 నుంచి జేఎల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): జూనియర్ లెక్చరర్ (జేఎల్)పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు అధికారులు ఈ నెల 13 నుంచి 19 వరకు గన్‌ఫౌండ్రీలోని మహబూబియా జూనియర్ కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఆర్జేడీ జయప్రదాబాయి తెలిపారు. మల్టీ జోన్-1లో 659, మల్టీజోన్-2లో 627 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌లో తొలుత ఆప్షన్లు ఎంచుకునే అవకాశమిస్తారు. ఆ తర్వాత ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేయనున్నారు.

**విద్యార్థుల మొబైల్స్‌కు నామినల్ రోల్స్**

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నామినల్ రోల్స్ తప్పుల సవరణలో ప్రిన్సిపాళ్లను సంప్రదించి సవరించుకునే అవకాశమిచ్చారు.














